దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



రాజారామ్ కాలనీలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: చలివేంద్రాలు దాహార్తి తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని రాజారామ్ కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రోజు రోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత వల్ల దాహార్తితో ఇబ్బంది పడేవారి కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, వాలా హరీశ్‌రావు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

మూసాపేట: మూసాపేట జనతానగర్‌లోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేష సంక్రమణం విషు పండగ సందర్భంగా పంతులు సభాపతి పవన్‌కుమార్ శర్మ సమక్షంలో ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 5గంటలకు శ్రీ మహాగణపతి హోమం, స్వామి వారికి నవవిధ పంచామృత మహాభిషేకం, అలంకార దర్శనం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానం, రాత్రి 7గంటలకు అయ్యప్ప పడిపూజ, అల్పాహారం నిర్వహించారు. స్థానిక నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, దళిత నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ కార్పొరేటర్లు, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు వేడుకల్లో పాల్గొని అంబేడ్కర్‌కు జోహార్లు అర్పించారు.

◆ గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ పరిపాలనా భవనంలో అంబేడ్కర్ చిత్రపటానికి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, ఉద్యోగులు నివాళులర్పించారు.

– శేరిలింగంపల్లి జోన్ బృందం



రాజారామ్ కాలనీలో.. నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్



హెచ్‌సీయూలో.. వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ దేవేష్‌నిగమ్



కొండాపూర్‌లో .. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ తదితరులు



రాయదుర్గంలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని సన్మానిస్తున్న బస్తీవాసులు



నల్లగండ్లలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో చిన్నారులు, స్థానిక నాయకులతో మాజీ కార్పొరేటర్ సాయిబాబా



చందానగర్‌లో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ తదితరులు



శేరిలింగంపల్లిలో.. కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మియాపూర్: మియాపూర్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నిత్యారాధన, పాలబోగ నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి, సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, పుష్పసేన ఆరాధన, వాసుదేవ పుణ్యావాచనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు 19వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ అర్చకుడు చక్రవర్తుల రాజాగోపాలచార్యులు తెలిపారు. అదే విధంగా ఈ నెల 17న సీతరామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



వివిధ పార్టీల నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్: డివిజన్ పరిధిలోని ప్రజయ్ సిటీలోని వివిధ పార్టీల నాయకులకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. రాష్ట్రం, నియోజకవర్గాలు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడాలి శ్రీధర్, శ్రీనివాస్, రవి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, గాంధీ, రవి కుమార్, రాంబాబు, రమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి నీలం మధు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి డీఎస్ కాలనీలో మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజకు మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ సేవా సమితి సభ్యులు నీలం మధును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు అశోక్, నిర్వాహకులు శ్రీరామ్ మూర్తి, రామకృష్ణ, సుబ్బారావు, సుందర్ నారాయణ, వెంకటేష్ శ్రీనివాస్, గౌరీనాయుడు, పోలినాయుడు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న నీలం మధు..

అమీన్‌పూర్ మండల పరిధిలోని గండిగూడెం గ్రామంలో మల్లన్న జాతరకు ఆదివారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను యాదవ సంఘం సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

వైఎస్ఆర్‌సీపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయం

గురజాల ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



గురజాల ఎమ్మెల్యే మహేశ్ రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ అభిమానులు

మియాపూర్: మియాపూర్‌లోని నరేన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురజాల నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. విద్య, ఉద్యోగ, వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌లో నివాసముంటున్న గురజాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గురజాల ఎమ్మెల్యే కె.మహేష్‌రెడ్డి, నర్సరావుపేట నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ, మేమంతా సిద్ధమంటూ జనక్షేత్రంలోకి వచ్చి అడుగడుగునా ప్రజల నీరాజనాలు అందుకుంటూ బస్సుయాత్ర కొనసాగిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి రాజకీయ ప్రత్యర్థులు తట్టుకోలేకపోతున్నారన్నారు. ప్రజల్లో వస్తున్న స్పందనకు ఓర్వలేక ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయన్నారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడ్డారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కుట్రలు, కుతంత్రాలతో ప్రత్యర్థులు అధికారంలోకి రావాలని చూస్తున్నారని, కానీ జనమంతా జగన్‌మోహన్ వైపే ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్‌సీపీకి ఓటు వేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. భారీ మెజార్టీతో వైఎస్ఆర్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి, మహేంద్రరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణానికి ఆహ్వానం



ఆహ్వాన పత్రం అందజేస్తున్న మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కోదండ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 19 వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో జరగనున్నాయి. ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలోని ఉత్సవ కమిటీ బృందం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుతోనే నియోజకవర్గ అభివృద్ధి



పాపిరెడ్డి కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సీతా రంజిత్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్, ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జెరిపేటి జైపాల్‌లతో కలిసి రంజిత్‌రెడ్డి సతీమణి సీతా రంజిత్‌రెడ్డి పాపిరెడ్డి కాలనీలో ప్రతి ఒక్కరినీ కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

కాలనీవాసుల సహకారంతో అభివృద్ధి



పాల్గొన్న అధ్యక్షుడు జలంధర్ తదితరులు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా కాలనీలో మన నల్లగండ్ల వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జలంధర్ మాట్లాడుతూ, కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ముఖంగా వంద అడుగుల రోడ్డులో కొత్త స్ట్రీట్ లైట్లు, రెండు చోట్ల హైమాస్ట్ లైట్లు, పాత వాటికి మరమ్మతులతో పాటు రూ.7.50 కోట్లతో 1.8 కిలో మీటర్ల రోడ్డు అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. కాలనీ వాసుల, జీహెచ్ఎంసీ అధికారుల, ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ స్టేషన్ ఫైర్ అధికారి జాన్య నాయక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిమాపక కార్యాలయంలో పరేడ్ నిర్వహించి, జెండాను ఆవిష్కరించారు.అనంతరం అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్మికులకు అండగా ఉంటాం

బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



రోడ్‌షోలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు): పారిశ్రామికవాడల్లో విధులు నిర్వర్తిస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులకు అండగా ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో ఆయన రోడ్ షో నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. మోదీతోనే దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తుందన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజలకు తగిన రక్షణను కల్పించేలా తాము ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరు మోదీకి ఓటు వేయాలన్నారు. ఎలాంటి అవగాహన లేని, భూ మాఫియా చేస్తున్న వ్యక్తిని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించటం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పాలనలో బొల్లారం మున్సిపాలిటీ అలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్‌కృష్ణారెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మేఘనా, జగన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని చిత్తారమ్మ ఆలయం పక్కన ఈనెల 17న శ్రీరామనవమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 11.03 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు అన్న సమారాధాన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

టెలీకామ్‌నగర్‌లో..

టెలీకామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 17న ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు ధర్మగారి రవీందర్‌రెడ్డి అన్నారు. ఉదయం 6 గంటలకు సాయిబాబాకు కాగడ హారతితో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం 7 గంటలకు గణపతి, దత్తాత్రేయస్వామి, షిర్డీ సాయిబాబా వారి క్షీరాభిషేకం, అనంతరం సాయి అష్టోత్తరాలు, విష్ణు సహస్రనామం, లక్ష్మీ అష్టోత్తరం, సాయి సహస్రనామ పారాయణాన్ని సామూహికంగా భక్తులతో నిర్వహిస్తామన్నారు.. అనంతరం 10 గంటల నుంచి 12 గంటల వరకు సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రసాద వితరణ చేస్తామన్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు భక్త బృందంచే ప్రత్యేక భజనలు, రాత్రి 9 గంటలకు ఆలయంలో శేజ్ హారతితో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

వ్యక్తి అదృశ్యం

గచ్చిబౌలి: కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది.. ఏఎస్ఐ సాయన్న తెలిపిన వివరాల ప్రకారం... మసీద్‌బండలో నివాసం ఉండే వై.శ్రీనివాస్ మార్చి 31న రాత్రి 9 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు రాత్రంతా ఎదురు చూసినా తిరిగి రాలేదు. దీంతో స్థానికంగా గాలించడంతో పాటు బంధు, మిత్రులను, వాకబు చేసినా శ్రీనివాస్ ఆచూకీ తెలియరాలేదు. దీంతో తల్లి సూర్యావతి ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దైనందిన జీవితంలో మిల్లెట్స్ భాగం కావాలి



మిల్లెట్స్ మీడియా పోర్టల్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న తార సత్యవతి

మాదాపూర్: ఆరోగ్యం గురించి, ఆహార విధానాల గురించి, చిరుధాన్యాల విలువపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మిల్లెట్స్ మీడియా పోర్టల్‌ను ప్రారంభించారు. మాదాపూర్‌లోని వెస్ట్‌సైడ్ హోటల్‌లో ఆదివారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ డైరెక్టర్ సి.తార సత్యవతి ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ మిల్లెట్స్‌ను దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని ఆమె సూచించారు. దీని వల్ల ఎన్నో జబ్బులు, వ్యాధుల నుంచి దూరం కావడమే కాకుండా మానసిక, శారీరక సామర్థ్యాలను మెరుగుపర్చుకోవచ్చని అన్నారు. మీడియా పోర్టల్ రూపకర్త శ్రీనివాస్ శరకడం మాట్లాడుతూ, తెలుగుభాషలో ఉన్న మీడియా పోర్టల్‌ను ఇంగ్లిష్, హిందీతో పాటు మరిన్నీ భాషల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ చిరుధాన్యాల ఉత్పత్తి దారుడు శేఖర్‌రెడ్డి చెర్ల, విజయవాడ చిరుధాన్యాల ఉత్పత్తి దారుడు గేదెల కిరణ్, గుంటూరుకు చెందిన కన్నూరి భ్రమర చారి, ప్రకృతి వైద్యులు మోనికా స్రవంతి, మిల్లెట్స్ కో ఆర్డినేటర్ యమున పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

రాజేంద్రనగర్: శివరాంపల్లి జడ్పీ పాఠశాలలో 2002–2003 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని సంతోషంగా గడిపారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. అలాగే మధుర జ్ఞాపకాలను తమ సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు నిరంజన్, శ్రీశైలం, అశోక్ కుమార్, మల్లయ్య, చారి, ఇస్మాయిల్, కిషన్, సురేందర్ రెడ్డి, నాగయ్య, జీనాత్ ఉన్నీసా పాల్గొన్నారు.

చదువుకున్న వారంతా ముందుకొచ్చి ఓటు వేయాలి

అపోలో ఆస్పత్రుల జేఎండీ కొండా సంగీతారెడ్డి



రాయదుర్గం: చదువుకున్న వారంతా ముందుకొచ్చి స్వచ్ఛందంగా ఓటు వేయాలని అపోలో ఆస్పత్రుల జేఎండీ కొండా సంగీతారెడ్డి కోరారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో అపర్ణాసైబర్ గేటెడ్ కమ్యూనిటీలో స్థానికులతో ఆమె సమావేశమై బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మే 13న మీరు ఓటు వేయడమేకాకుండా మీ తోటి వారంతా ఓటు వేసేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. బీజేపీ గాలి దేశ వ్యాప్తంగా వీస్తోందని, మళ్లీ ప్రధానిగా నరేంద్రమోదీ కావడం ఖాయమని, ఈ నేపథ్యంలో బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు శేరిలింగంపల్లి బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం

అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ శ్రీ నల్లపోచమ్మ దేవాలయం శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. గణపతి పూజ, అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం కలశాలను సంప్రోక్షణ, గ్రామోత్సవం చేశారు. సోమవారం ఆలయ శిఖరంపై ప్రతిష్ఠ అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు విఠల్, నర్సింహ్మాచారి, వెంకటయ్య, బాలుయాదవ్, ఎర్రన్న, విఠల్, విరేశ్‌యాదవ్, శ్రీనివాస్, రామిరెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్‌నగర్‌లో కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శిల్పారామం, శ్రీనివాస ఆర్ట్ అకాడమీ సంయుక్త నిర్వహణలో దివంగత డాక్టర్ శోభనాయుడు శిష్య బృందంచే శోభాభినయం కూచిపూడి నృత్య నీరాజనాన్ని సమర్పించారు. మమవతు శ్రీసరస్వతి, భావయామి, తీరుతీరు, దుర్గ, ధనశ్రీ తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. ప్రముఖ నాట్య గురువులు అలేఖ్య పుంజల, అంజుబాబు, గాయని నిత్యసంతోషిణి, వేణువు దత్తత్రేయ, గురువు సుధీర్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ముగిసిన 'సీబీఐటీఎంయూఎన్-2024' కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు, ప్రతినిధులు

హఫీజ్‌పేట్: చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) ఆధ్వర్యంలో మూడు రోజు పాటు నిర్వహించిన సీబీఐటీఎంయూఎన్-2024 కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షరటాన్ హోటల్‌లో సీబీఐటీ ఆధ్వర్యంలో మోడల్ యునైటెడ్ నేషన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ సమస్యలపై ఉత్సాహభరిత వాతావరణంలో చర్చలు జరిగాయి. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ షగుప్తా పర్వీన్ మార్గదర్శనంలో జరిగిన ఈ చర్చల్లో 400 మంది ప్రతినిధులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. నిర్వాహకులను, విద్యార్థులను సీబీఐటీ ప్రిన్సిపల్ నర్సింహులు అభినందించారు.

17న సీతారాముల కల్యాణం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని రాధాకృష్ణ సీతారామ సమేత శ్రీ కుసుమ హరినాథ బాబా మందిరం ఆవరణలో ఈ నెల 17న సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కల్యాణం అనంతరం అన్నదానం, సాయంత్రం ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మణికొండ: హైదరాబాద్ నగర శివారు కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల్లోని సమస్యలపై తనకు పూర్తి స్థాయిలో అవగాహన ఉందని, రాబోయే రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, లింక్ రోడ్లు, పార్కుల అభివృద్ధి వంటి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో పలు సమస్యలు పరిష్కారం అయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జితేందర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.